క్లుప్తంగా

ఐకేపీ గ్రామ సంఘాల రికార్డుల తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న ఆడిటర్ దత్తాత్రి

చిలప్‌చెడ్(నర్సాపూర్): చిలప్‌చెడ్ మండల ఐకేపీ గ్రామ సంఘాలకు సంబంధించిన 2022 - 23 ఆర్థిక సంవత్సర రికార్డులు తనిఖీ నిర్వహించామని కమ్యూనిటీ బేస్డ్ ఆర్గనైజేషన్ ఆడిటర్ దత్తాత్రి అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రం చిలప్‌చెడ్ ఐకేపీ కార్యాలయంలో 14 గ్రామాలకు సంబంధించిన అంతర్గత తనిఖీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం ప్రేమలత, సీసీలు పురుషోత్తం, నర్మద, వెంకటలక్ష్మి, వరలక్ష్మి, ఐకేపీ అకౌంటెంట్ మానస ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు



పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న ఎంపీపీ

పెద్దశంకరంపేట(మెదక్): గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎంపీపీ జంగం శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని చీలాపల్లిలో పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజలు రోగాల బారిన పడకుండా పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టాలని గ్రామ కార్యదర్శులకు సూచించారు. అనంతరం ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి, రోగులకు అందుతున్న సేవలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రఫీఖ్‌ఉన్నీసా, సర్పంచ్ ప్రకాష్, ఎంపీటీసీలు దామోదర్, స్వప్నరాజేష్, ఎంపీఓ విఠల్‌రెడ్డి, గ్రామస్తులు భూంరెడ్డి, రోషిరెడ్డి, రామ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న ఎంపీపీ శ్రీనివాస్

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలో ఎంపీపీ మాసుల శ్రీనివాస్ సీఎంఆర్ఎఫ్ చెక్కును బుధవారం అందించారు. చేగుంటకు చెందిన కమ్మరి రమేశ్‌కు రూ.60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి మంజూరీ చేయించారు. కార్యక్రమంలో అమర్‌నాథ్, సహకార సంఘం చైర్మన్ పరమేశ్, ఉప సర్పంచ్ సంతోష్ తదితరులు ఉన్నారు.

ధాన్యం త్వరగా ఖాళీ అయ్యేలా చర్యలు చేపట్టాలి



కలెక్టర్‌కు కలిసిన జెడ్పీటీసీ మహేశ్‌గుప్తా

శివ్వంపేట(నర్సాపూర్): కొనుగోలు కేంద్రాల నుంచి సేకరిస్తున్న ధాన్యం త్వరగా ఖాళీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజర్షిషాను బుధవారం జెడ్పీటీసీ మహేశ్‌గుప్తా కోరారు. మెదక్ కలెక్టరేట్‌లో కలిసి మండలంలో ధాన్యం త్వరగా ఖాళీకాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న సమస్యను పరిష్కరించాలని కోరినట్లు జెడ్పీటీసీ తెలిపారు.

'ఓడిపోతాననే భయంతోనే ఆరోపణలు'



మాట్లాడుతున్న కిషన్

రేగోడ్(మెదక్): రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోతాననే భయంతో అందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహపై అసత్య ఆరోపణలు చేస్తున్నాడని పీసీసీ సభ్యుడు మున్నూరు కిషన్ మండిపడ్డారు. రేగోడ్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.దిగంబర్ రావు, పార్టీ మండల ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, జెడ్పీటీసీ యాదగిరి, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు నాగిరెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు చోటుమియా, పీఏసీఎస్ డైరెక్టర్ నాగేందర్‌రావ్ కులకర్ణి, పార్టీ గ్రామ అధ్యక్షుడు శంకరప్ప, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు పీర్యానాయక్, నాయకులు రాములు, మోహన్, సంగిలింగం తదితరులు పాల్గొన్నారు.

పండ్ల రసం పంపిణీ

నర్సాపూర్: ఎండ వేడిమికి ప్రజల దాహం తీర్చేందుకు పలువురు వ్యాపారులు పండ్ల రసం పంపిణీ చేశారు. నర్సాపూర్ మెయిన్‌రోడ్డుపై గల పలువురు వ్యాపారులు రోడ్డుపై పండ్ల రసం పెట్టి రోడ్డుపై వెళ్లే వారికి పంపిణీ చేశారు.

ఉద్యోగాల్లో క్రీడాకారులకు రిజర్వేషన్లు

- నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి
- ముగిసిన మండల స్థాయి సీఎం కప్ పోటీలు



నర్సాపూర్: విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, నాయకులు

నర్సాపూర్: రాబోయే రోజుల్లో ఉద్యోగాల భర్తీలో క్రీడాకారులకు రిజర్వేషన్ కల్పించే అవకాశాలు ఉన్నాయని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి చెప్పారు. మండలంలో చేపట్టిన సీఎం కప్ టోర్నమెంట్‌లో పాల్గొని విజేతలకు బుధవారం ఉదయం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలకు సీఎం ప్రాధాన్యత ఇస్తున్నారని అందులో భాగంగానే సీఎం కప్ టోర్నమెంట్‌ను నిర్వహించామన్నారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీటీసీ బబియానాయక్, ప్యాక్స్ చైర్మన్ రాజుయాదవ్, నాయకులు చంద్రాగౌడ్, మన్సూర్, వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌గుప్తా, నర్సింగ్‌రావు, శేఖర్, శివకుమార్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

కౌడిపల్లి(నర్సాపూర్): కౌడిపల్లిలో సీఎం కప్ విజేతలకు ఎమ్మెల్యే మదన్‌రెడ్డి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వాలీబాల్‌లో తునికి ప్రథమ, పీర్లతండా ద్వితీయ బహుమతి, కబడ్డీలో భుజిరంపేట ప్రథమ, వెల్మకన్న ద్వితీయ బహుమతి సాధించింది. దీంతో పాటు ఖోఖో, రన్నింగ్, షాట్‌పుట్ క్రీడల్లో బహుమతులు సాధించిన క్రీడాకారులకు ఎమ్మెల్యే బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీపీ రాజునాయక్, జెడ్పీటీసీ కవిత, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రామాగౌడ్, డీసీసీబీ డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ చిన్నంరెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ జగన్, ఎంపీఓ వెంకటేశం, పంచాయతీ కార్యదర్శులు క్రీడాకారులు పాల్గొన్నారు.

కొల్చారం(నర్సాపూర్): మండలంలో రంగంపేట ఉన్నత పాఠశాలలో క్రీడా పోటీలు ముగిసాయి.

అల్లాదుర్గం(మెదక్): మండల స్థాయి సీఎం కప్ క్రీడల్లో గెలుపొందిన వారికి దక్షిణ మధ్య రైల్వే బోర్డు మెంబర్ కాశీనాథ్, ఎంపీపీ అనిల్‌కుమార్‌రెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ దుర్గారెడ్డి, ఎంపీడీఓ శంకర్, ఎంపీఓ సయ్యద్, ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి, సర్పంచ్ అంజయ్య యాదవ్, ఫీజికల్ డైరెక్టర్ అశోక్ పాల్గొన్నారు.

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సీఎం కప్ విజేతలకు ఎంపీపీ శ్రీనివాస్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రఫీఖ్ ఉన్నీసా, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రాములు, సర్పంచ్‌లు అనంతరావు, ప్రకాష్, ఎంపీటీసీలు వీణ, స్వప్న, హెచ్ఎం రామచంద్రాచారి, నాయకులు పాల్గొన్నారు.

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి, మాసాయిపేట మండల కేంద్రాల్లో విజేతలకు ఎంపీపీ స్వరూప, జెడ్పీటీసీ రమేశ్‌గౌడ్, రామాయంపేట సీఐ చంద్రశేఖర్ రెడ్డి, చేగుంట ఎస్ఐ ప్రకాస్ గౌడ్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటలక్ష్మమ్మ, మాసాయిపేట సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేగుంట(తూప్రాన్): మండలంలో మోడల్ పాఠశాలలో ముగింపు కార్యక్రమంలో గెలుపొందిన క్రీడాకారులకు ఎంపీపీ శ్రీనివాస్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కోచ్ కరణం గణేశ్, పీఈటీలు మంజుల, నాగార్జున్, గోవర్దన్ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

శివ్వంపేట(నర్సాపూర్): క్రీడల్లో గెలుపోటములు సహజమని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా, ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రగౌడ్, జెడ్పీ కో ఆప్షన్ మెంబర్ మన్సూర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణగౌడ్, మండల సర్పంచ్‌ల పోరం అధ్యక్షురాలు లావణ్య, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి, ఎంపీటీసీ నర్సింహారెడ్డి, ఎంఈఓ బుచ్చానాయక్, ఉప సర్పంచ్ శ్రీనివాస్, పీడీలు, తదితరులు ఉన్నారు.

పాపన్నపేట(మెదక్): మండల కేంద్రంలో ఎంపీడీఓ జగదీశ్వరాచారి విజేతలకు బహుమతులు అందజేశారు. వాలీబాల్ (కొడుపాక) కబడ్డీ(పాపన్నపేట) ఖోఖో(కుర్తివాడ), షాట్‌పుట్(రాజ్‌కుమార్)100 మీటర్ల రన్నింగ్(రగు,గణేశ్,నవీన్) 400 మీటర్లు (ప్రశాంత్, రగు, నవీన్)విజయం సాధించి, జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో తహసీల్దార్ గంగా ప్రసాద్, సర్పంచ్‌లు గురుమూర్తి, లింగారెడ్డి, ఏఎస్ఐ గాలయ్య, రైస్ మిల్లర్స్ రాజు, కృష్ణమూర్తి,రాము, పీఈటీలు చంద్రమోహన్, రవి, వినోద్, మధు, మనోహర్, ప్రభాకర్, రేణుక, వీరేశం, ప్రసాద్ పాల్గొన్నారు.

రామాయంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలో నిర్వహించిన సీఎం కప్ పోటీలో విజేతలకు ఎంపీపీ సబిత బహుమతులు అందజేశారు. సమావేశంలో వైస్ ఎంపీపీ సుజాత, ఎంటీటీసీ సత్యనారాయణ, వల్లూరు సర్పంచ్ ఆనందాస్ మహేశ్వరి, పెద్ద తండా సర్పంచ్ చత్రియా నాయక్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు విష్ణువనర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



రామాయంపేట(మెదక్): నార్సింగి మండలంలో..



తూప్రాన్: పట్టణంలో..



బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే, జేసీ

తూప్రాన్: పట్టణంలోని నిర్వహించిన క్రీడల్లో గెలుపొందిన విజేతలకు గడా ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డి బహుమతులు, ధృవపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్యాంప్రకాశ్, మున్సిపల్ చైర్మన్ రవీందర్‌గౌడ్, ఎంపీడీఓ అరుందతి, ఎంపీఓ రమేశ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులను ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, సర్పంచ్ రాజిరెడ్డి అందించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, పీఈటీలు పాల్గొన్నారు.

సబ్సిడీపై జనుము, జీలుగ విత్తనాలు



విత్తనాలను పరిశీలిస్తున్న ఏఓ, ఏఈఓ

కౌడిపల్లి(నర్సాపూర్): ఆగ్రోస్ రైతు సేవాకేంద్రంలో పచ్చిరొట్ట, జనుము, జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏఓ స్వప్న తెలిపారు. బుధవారం ఆగ్రోస్ రైతుసేవా కేంద్రానికి పచ్చిరొట్ట విత్తనాలు రావడంతో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పచ్చిరొట్ట సాగుచేసి పూత దశలో నేలలో కలియదున్నడంతో భూమి సారవంతమై పంటకు కావాల్సిన పోషకాలు అందుతాయన్నారు. సబ్సిడీ పోను జీలుగ 30కిలోల బస్తా రూ. 843, జనుము 40కిలోల బస్తా రూ. 1,225 లభిస్తుందన్నారు. ఎకరాకు 12కిలోల పచ్చిరొట్ట విత్తనాలు సరిపోతాయని తెలిపారు. కావాల్సిన రైతులు పట్టాదార్ పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు, ఫోన్‌నంబర్ రైతు సేవా కేంద్రంలో ఇచ్చి కొనుగోలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రాజశేఖర్‌గౌడ్, ఆగ్రోస్ యజమాని ఉడుత వెంకటేశం, రైతు వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

నర్సాపూర్‌రూరల్: నర్సాపూర్ ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో 150 క్వింటాళ్ల జీలుగా విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి అనిల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 50 శాతం సబ్సిడీపై రైతులకు విత్తనాలను అందజేస్తామన్నారు. పట్టాదార్ పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్ తీసుకొని రావాలని సూచించారు.

పరిహారం అందజేత



ప్రొసిడింగ్‌ను అందజేస్తున్న సునీతారెడ్డి

నర్సాపూర్: తమ కుటుంబీకులు వరదలో కొట్టుకుపోయిన బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం మంజూరైందని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి చెప్పారు. నర్సాపూర్‌కు చెందిన లక్ష్మీనారాయణ రెడ్డి భార్య శ్వేత, అతని కుమారుడు త్రిశంత్‌రెడ్డి సుమారు రెండేళ్ల క్రితం వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో ఫంక్షన్‌కు వెళ్లి వస్తూ వరదలో తల్లి, కుమారుడు కొట్టుకుపోయి మరణించారని ఆమె వివరించారు. దీంతో బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి మంజూరైన రూ. 8 లక్షల చెక్కును సునీతారెడ్డి బుధవారం అందజేశారు.

మురికికాల్వ లేక ఇబ్బందులు

శివ్వంపేట(నర్సాపూర్): మురికికాల్వ లేక కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శివ్వంపేట పంచాయతీ 12 వ వార్డులో కాల్వ లేక మురికి నీరు నిల్వ ఉంటుందని కాలనీ వాసులు వారాల గణేశ్, వెంకటేశ్ ఆరోపించారు. ఈ విషయమై.. సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్ వివరణ కోరగా నిధులు కొరతతో మురికికాల్వ నిర్మాణం చేపట్టలేదని, నిధులు మంజూరు కాగానే పనులు చేస్తామని చెప్పారు.

సీఎం కేసీఆర్‌తోనే పల్లెలు అభివృద్ధి



వీధులను శుభ్రం చేస్తున్న ప్రజాప్రతినిధులు

మనోహరాబాద్(తూప్రాన్): సీఎం కేసీఆర్‌తోనే పల్లెలు అభివృద్ధి బాట పట్టాయని రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్‌మెంట్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం స్వచ్ఛభారత్‌లో భాగంగా మండల కేంద్రంలో వీధులను శుభ్రం చేశారు. అంతకు ముందు మండల కేంద్రంలో జరిగిన సీఎం కప్ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. కబడ్డీ, వాలీబాల్‌లో మనోహరాబాద్ మొదటి బహుమతి, మనోహరాబాద్ పోలీస్, లింగారెడ్డిపేట్‌లకు రెండో స్థానం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తూప్రాన్ పీఏసీఎస్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు మహేశ్, మండల ప్రత్యేక అధికారి కృష్ణమూర్తి, తహసీల్దార్ భిక్షపతి, ఎంపీడీఓ యాదగిరిరెడ్డి, సర్పంచ్ మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఆర్థికసాయం



నిజాంపేట(మెదక్): మండల కేంద్రం నిజాంపేటలో బుధవారం అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబానికి జెడ్పీటీసీ పంజా విజయ్‌కుమార్ సన్నిహితులు ఆర్థిక సాయం అందజేశారు. ఈ మేరకు నిజాంపేట మండల కేంద్రానికి చెందిన పూసల రామదాసు బుధవారం ఉదయం ఆకస్మికంగా గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో అతని కుటుంబానికి జెడ్పీటీసీ రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో జాల పోచయ్య, గర్గుల శ్రీనివాస్, వెంకటేశ్, తాడెం శ్రీకాంత్, లక్ష్మణ్, దేవుని రాజు, తమ్మలి రమేశ్ పాల్గొన్నారు.

చేగుంట(తూప్రాన్): ఇటీవల బీ.కొండాపూర్‌లో మృతి చెందిన దుబ్బ రాజవ్వ కుటుంబీకులకు బీఆర్ఎస్ జిల్లా నాయకులు రాజిరెడ్డి తరఫున ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో మైసయ్య, సంజీవ్, లాలయ్య, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ డివిజన్ చేయాలి

నిజాంపేట(మెదక్): రామాయంపేటను రెవెన్యూ డివిజన్ చేయాలని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి పిలుపుమేరకు నిజాంపేట మండల కేంద్రం నుంచి కాంగ్రెస్ నాయకులు ర్యాలీగా రామయంపేట బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు లింగం గౌడ్, తదితరులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నశంకరంపేట(మెదక్): రామాయంపేట రెవెన్యూ డివిజన్ ఆందోళనకు మండలంలోని కాంగ్రెస్ కార్యకర్తలు బైక్ ర్యాలీగా తరలివెళ్లారు. బుధవారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోతరాజ్ రమణ ఆధ్వర్యంలో యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో బైక్ ర్యాలీగా రామాయంపేటకు తరలివెళ్లారు.

ఎండలో శానిటేషన్ పనులు



మనోహరాబాద్(తూప్రాన్): తీవ్రమైన ఎండలో పంచాయతీ కార్మికులతో శానిటేషన్ పనులు ఎలా చేయిస్తారని జిల్లా పంచాయతీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆసీఫ్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్మికులతో కలిసి ఎంపీడీఓ యాదగిరి రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికులతో మండుటెండలో పనులు చేయించడం అన్యాయమన్నారు. ఉదయం 11గంటలలోపే పనులు చేయించాలన్నారు. వీరి వెంట స్వామి, అంజయ్య, రమేశ్, యాదగిరి, భిక్షపతి, బాలమణి, శోభ, ఎల్లమ్మ తదితరులున్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



శివ్వంపేట(నర్సాపూర్): రైతుల కోసం గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ హరికృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి, వైస్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని గంగాయిపల్లి, రెడ్యాతండా, మగ్దుంపూర్, బిజ్లిపూర్, బోజ్యాతండాలో కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఈఓ సుభాష్, సీఈఓ మధు, పవన్‌గుప్తా తదితరులు ఉన్నారు.

'ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయండి'

టేక్మాల్(మెదక్): బీఆర్ఎస్ పార్టీ చేపడుతున్న ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని మండల పార్టీ అధ్యక్షుడు బత్తుల వీరప్ప బుధవారం తెలిపారు. గురువారం ఉదయం 11 గంటలకు అల్లాదుర్గం మండలంలోని ముస్లాపూర్ ఫంక్షన్ హాల్‌లో జరిగే సభకు అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్, పార్టీ ముఖ్య నాయకులు హాజరవుతున్నారని, ఈ కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నకిలీ విత్తనాలతో అప్రమత్తంగా ఉండాలి



చిలప్‌చెడ్(నర్సాపూర్): తనిఖీ చేస్తున్న ఎస్ఐ, ఏఈఓలు



అల్లాదుర్గం(మెదక్): మాట్లాడుతున్న ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి



రామాయంపేట(మెదక్): మాట్లాడుతున్న సీఐ చంద్రశేఖర్‌రెడ్డి

అల్లాదుర్గం(మెదక్): ఫర్టిలైజర్ డీలర్లు నకిలీ విత్తనాలు అమ్మితే జైలు పాలు అవుతారని, రైతులను మోసం చేసి డబ్బులు సంపాదించాలనే అక్రమార్కులపై క్రిమినల్ కేసులు పెట్టి, కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి, ఏఓ రాజేశ్‌లు హెచ్చరించారు. బుధవారం అల్లాదుర్గం రైతు వేదికలో ఫర్టిలైజర్ డీలర్లు, రైతులు, పోలీసులతో నకిలీ విత్తనాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులను మోసం చేస్తున్నారని వారితో రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శంకర్, ఏఈఓ మహేశ్ పాల్గొన్నారు.

కల్తీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

రామాయంపేట(మెదక్): కల్తీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ చంద్రశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. కల్తీ విత్తనాల నిరోధకానికి వ్యవసాయశాఖ, పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం సర్కిల్ కార్యాలయంలో డీలర్లకు మండల వ్యవసాయ అధికారి రాజ్‌నారాయణ కల్తీ విత్తనాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఫర్టిలైజర్ దుకాణాల్లో ప్రభుత్వ అనుమతులు ఉన్న ఎరువులు, విత్తనాలనే విక్రయించాలని ఎస్ఐ మహ్మద్ గౌస్ అన్నారు. మండల కేంద్రం చిలప్‌చెడ్ గ్రామంలోని ఆగ్రో రైతు సేవా కేంద్రాన్ని బుధవారం ఆయన ఏఈఓ భూపాల్‌తో కలిసి తనిఖీ చేశారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం నిర్వాహకుడు రమేశ్ ఉన్నారు.

వెల్దుర్తి(తూప్రాన్): నకిలీ విత్తనాలు అమ్మితే సీడ్ యాక్ట్ ప్రకారం కఠిన చర్యలు తప్పవని మాసాయిపేట మండల వ్యవసాయాధికారి రాజశేఖర్, చేగుంట ఎస్ఐ ప్రకాశ్‌గౌడ్ హెచ్చరించారు. మాసాయిపేట మండల కేంద్రంలో విత్తన డీలర్‌లు, తయారీ దారుల సమావేశం నిర్వహించి పలు సలహాలు, సూచనలు అందజేశారు. అనంతరం రైతు సేవాకేంద్రాన్ని ఏఓ, ఎస్ఐలు తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు.

పారిశుధ్య కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలి



పనులు పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి యాదయ్య

ఎచిలప్‌చెడ్(నర్సాపూర్): ఈ నెల 17 నుంచి 23 వరకు గ్రామాల్లో నిర్వహించే ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని డీఎల్‌పీఓ యాదయ్య అన్నారు. బుధవారం ఆయన చిలప్‌చెడ్ మండలంలోని ప్రత్యేక పారిశుధ్య అధికారిగా యాదయ్య బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మండల కేంద్రం చిలప్‌చెడ్‌తో పాటు శీలాంపల్లి, సామ్లాతండా, రహీంగూడ తండాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు లక్ష్మీరెడ్డి, కవితారెడ్డి, గన్నీబాయి, భిక్షపతి, ఏపీఓ శ్యాంకుమార్, కార్యదర్శులు అఖిల్, మనోచారి, భూమేశ్, నాయకులు, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

మాంసం దుకాణదారులకు నోటీసులు

సాక్షి ఎఫెక్ట్



తనిఖీ చేస్తున్న అధికారులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో నాసిరకం మాంసం విక్రయాలపై 'సాక్షి' దినపత్రికలో మంచి మాంసం అమ్మకాలు జరిగేలా చూడాలి కథనం ప్రచురితమైంది. అందుకు గాను బుధవారం పశువైద్యాధికారి సంధ్య, పంచాయతీ కార్యదర్శి సంతోష్ మటన్, చికెన్ దుకాణాలను సందర్శించారు. ఈ సందర్భంగా మాంసం విక్రయదారులకు నోటీసులు జారీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అనారోగ్యానికి గురైన కోళ్లు, మేకలు, గొర్రెల మాంసం విక్రయిస్తే సంబంధిత వ్యాపారులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనల ప్రకారం ప్రజలకు ఆరోగ్యకరమైన జీవాల మాంసం అమ్మకాలు జరపాలని, దుకాణాల వద్ద పరిశుభ్రత పాటించాలని సూచించారు.

డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న పేదలు

తూప్రాన్: పట్టణంలో డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం పేదలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం నిరసన వ్యక్తం చేశారు. పట్టణంలో పేదల కోసం నిర్మించిన 472 ఇళ్లను నిర్మించి పంపిణీ చేశారు. అయితే అసలైన నిరుపేదలకు దక్కాల్సిన ఇళ్లను నాయకులు తమ కావాల్సిన వారికి ఇప్పించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి, తమ ఆర్థిక పరిస్థితులు గుర్తించి డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలని కోరారు. లేని పక్షంలో తాము ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

'అభ్యంతరాలు ఉంటే చెప్పండి'



బాధితులతో మాట్లాడుతున్న తహసీల్దార్

మెదక్ రూరల్: మెదక్ – ఎక్కతుర్తి రోడ్డు విస్తరణలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే రెవెన్యూ అధికారులకు తెలియజేయాలని హవేలీఘనాపూర్ ఇన్‌చార్జ్ తహసీల్దార్ మల్లయ్య అన్నారు. బుధవారం హవేలీఘనాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో రోడ్డు విస్తరణలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. ఔరంగాబాద్, శంకపూర్ శివార్లలో 39 మంది రైతుల భూములు రోడ్డు విస్తరణలోకి వెళ్తున్నాయని వాటికి సంబంధించిన అభ్యంతరాలను రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మహేశ్, సర్పంచ్ లింగం, ఔరంగాబాద్ కౌన్సిలర్ కిషోర్ తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలని రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్, రైతులు

నర్సాపూర్: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వడ్లను వేగంగా తూకం వేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం పట్టణంలోని ప్రధాన చౌరస్తాలో మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్ ఆధ్వర్యంలో రైతులు వడ్ల ట్రాక్టర్‌తో వచ్చి రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మండల తహసీల్దార్ ఆంజనేయులు, ఆర్ఐ ఫైజల్‌లు అక్కడికి వచ్చి రాస్తారోకో విరమించాలని వారు మురళీయాదవ్‌ను కోరగా ఆయన మాట్లాడుతూ... రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని, వడ్లు ఎండినా ఎందుకు తూకం వేయడం లేదని ప్రశ్నించారు. వడ్లలో తేమ లేకపోయినా తరుగు పేరిట బస్తాకు మూడు నుంచి ఐదు కిలోలు కోత విధిస్తూ రైతులను నష్టం చేస్తున్నా ఎవరు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఎమ్మెల్యే క్రీడల పేరిట కబడ్డీ ఆడుతున్నారని, రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తూకం వేసిన వడ్లను రవాణా చేసేందుకు లారీలు లేవనడం విచారకరమని వాపోయారు. రాత్రి పూట రైతులు తిరగడంతో ప్రమాదాలు జరిగి వారి ప్రాణాలు పోతున్నా ఎవరు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దార్ స్పందిస్తూ.. ప్రస్తుతం తాము వాహనాలు సమకూరుస్తున్నామని రాస్తారోకో విరమించాలని కోరడంతో ఆయన రాస్తారోకో విరమించారు. అనంతరం తహసీల్దార్ ఆంజనేయులు, ఎస్ఐ శివకుమార్‌లు చౌరస్తా మీదుగా వెళ్తున్న పలు వాహనాలు తనిఖీ చేసి, ఖాళీగా వచ్చిన పలు వాహనాలను కొనుగోలు కేంద్రాలకు తరలించారు.